వైభవంగా నాంచారమ్మ తిరునాళ్ల



గ్రామోత్సవంతో నాంచారమ్మ పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు



నాంచారమ్మ తల్లికి ఏర్పాటు చేసిన కుంకుమ బండ్లు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నందనవనంలో ఆదివారం నాంచారమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు కుంకుమ బండ్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పొంగళ్లు ఏర్పాటు చేసి గ్రామోత్సవంతో మేళతాళాల నడుమ సంబరాలు చేసుకుంటూ పొంగళ్లు, కుంకుమ బండ్లను అమ్మవారి ఆలాయానికి తరలించారు. కుంకుమబండ్లు, పొంగళ్లు నాంచారమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీటీసీ ఎస్ నారాయస్వామి, మాజీ సర్పంచ్ ఆకుమల్ల నాగ బ్రహ్మంచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని అయ్యలూరివారిపల్లిలో బండ్లు, పొంగళ్ల ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 26 నుంచి గ్రామ దేవత పోలేరమ్మతల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండ్లు పొంగళ్ల ఉత్సవం చేపట్టారు. గ్రామ పెదకాపు ముత్యాల నారాయణరెడ్డి పూసల బండి ముందుగా బయలు దేరగా మొక్కులు ఉన్న భక్తులు పూసలబండ్లు కట్టి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పోలేరమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణరెడ్డి దంపతులు, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వెంకటరెడ్డి దంపతులు, భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.



పూసల బండితో వైస్ ఎంపీపీ ప్రభంజన వెంకటరెడ్డి దంపతులు



బండ్లు, పొంగళ్ల ఉత్సవాన్ని తిలకిస్తున్న ముత్యాల నారాయణరెడ్డి బ్రదర్స్, భక్తులు



పూజల్లో పాల్గొన్న డాక్టర్ మాదాసి వెంకయ్య

ఘనంగా పోలేరమ్మతల్లికి పొంగళ్లు

మద్దిపాడు: మండలంలోని కాకర్ల గ్రామంలో ఆదివారం పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు ఘనంగా పొంగళ్లుపెట్టారు. గ్రామానికి చెందిన ఓగిరాల సుబ్బారెడ్డి ఆహ్వానం మేరకు పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. సహపంక్తి భోజనాల అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన ధర్మవరం గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి భార్య కోటిరత్నంను పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు బోద రమణారెడ్డి, మద్దిపూడి సొసైటీ అధ్యక్షులు భోగసముద్రం విజయభాస్కర్ రెడ్డి, బీసీ నాయకుడు మాచేపల్లి నాగయ్య, మొల్లల ప్రభాకర్‌రెడ్డి, మొల్లల పెద బ్రహ్మారెడ్డి, మునపాటి నరసింహారావు, ఓగిరాల నారాయణరెడ్డి, సర్పంచ్‌లు పులిచర్ల రామిరెడ్డి, గంగిరెడ్డి రమణారెడ్డి, మాచేపల్లి హనుమంతురావు, యాళ్ల హనుమంతరావు, గొట్టపల్లి మల్లికార్జునరావు, ఎస్సీ నాయకులు కోండ్రు సాల్మన్, లగడపాటి మాధవ ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

వెలిగండ్ల: మండలంలోని పలు పంచాయతీల్లో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం, వాటర్ ప్లాంట్ నిర్మాణం, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు జిల్లా పరిషత్ నుంచి రూ.63 లక్షల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి తెలిపారు. హుస్సేన్‌పురం పద్మాపురంలో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి రూ.30 లక్షలు, గుడిపాటిపల్లిలో సైడు కాల్వల నిర్మాణానికి రూ. 5 లక్షలు, జాళ్లపాలెంలో గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, గన్నవరంలో గ్రావెలింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, నాగిరెడ్డిపల్లిలో గ్రావెలింగ్ రోడ్డుకు రూ.5 లక్షలు, మరపగుంట్లలో గ్రావెలింగ్ రోడ్డుకు రూ.5 లక్షలు, రామలింగాపురంలో సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, వెలిగండ్ల కస్తూరిబా పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌కు రూ.3 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

సంఘటిత ఉద్యమాలతో సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న నేతలు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోసం సంఘటిత ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.మాలకొండయ్య పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ఆదానీ సంస్థలకు అమ్మేస్తూ దేశాన్ని అప్పుల దేశంగా మారుస్తున్న బీజేపీ పాలకవర్గంపై కార్మిక వర్గం ఆగ్రహంగా ఉందన్నారు. అనంతరం ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడుగా కె.మురళీకృష్ణ, కోశాధికారిగా అన్నవరపు బ్రహ్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పి.బాలకోటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.మాల్యాద్రి, ఎన్ నర్సయ్య పాల్గొన్నారు.

సుల్తాన్‌బీబీ గంథ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దర్గా ప్రెసిడెంట్, సభ్యులు

గుడ్లూరు: మండలంలోని తెట్టులో వేంచేసి ఉన్న సయ్యద్ సుల్తాన్‌బీబీ అమ్మవారి గంథ మహోత్సవం పోస్టర్‌ను ఆదివారం దర్గా ప్రెసిడెంట్ షేక్ మహబూబ్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన సుల్తాన్‌బీబీ అమ్మవారి 131వ గంథ మహోత్సవ వేడుకలను జూన్ 1న అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు మహోత్సవానికి హాజరవుతారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దర్గా మాజీ ప్రెసిడెంట్ సయ్యద్ సుల్తాన్, మాజీ సర్పంచ్ షేక్ మస్తాన్‌బాషా(గౌస్), సుల్తాన్‌బాషా, సుల్తాన్ షరీఫ్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న వాహనదారులు

కందుకూరు: మోటార్ వాహనాల నుంచి వెలువడే కాలుష్య నియంత్రణకు ప్రతి వాహనచోదకుడు సహకరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రఫీ సూచించారు. మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని కారు స్టాండ్ వద్ద వాహన యజమానులకు కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌లో సిగ్నల్ పడినప్పుడు ప్రతి వాహనదారుడు తమ వాహన ఇంజన్లను ఆపు చేయాలని, దీని వల్ల వెలువడే కాలుష్యం తగ్గుతుందన్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల మానవాళి అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుందని, ప్రధానంగా శ్వాసకోశ సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటివి వస్తున్నాయని చెప్పారు. ప్రతి వాహనదారుడు తమ వాహనాలను ఇంజన్లను సకాలంలో సర్వీస్ చేయించడం వల్ల కాలుష్యం ఎక్కువ రాకుండా ఉంటుందన్నారు. వాహన కాలుష్యం నివారిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మంత్రి సురేష్ శుభాకాంక్షలు

పుల్లలచెరువు: హజ్ యాత్రకు వెళ్తున్న వారికి రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ జానీబాషా కుటుంబం సోమవారం హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి ఆదిమూలపు సురేష్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు 45 రోజుల హజ్ యాత్ర గురించి జానీబాషాను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రను ప్రశాంతంగా ముగించుకుని ఆనందంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ నిరసన ర్యాలీ

కనిగిరి రూరల్: పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై టీడీపీ నేత చంద్రబాబు చేసిన దుర్మార్గపు వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం సాయంత్రం 4 గంటలకు కనిగిరిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన బైక్ ర్యాలీ జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు తీరును నిరసిస్తూ భారీ బైక్ ర్యాలీ నేడు

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఇచ్చిన నివాస స్థలాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శ్మశాన వాటికలతో పోల్చి పేదలను దారుణంగా అవమానించినందుకు నిరసనగా భారీ సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం ఆదివారం తెలిపింది. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు నుంచి పొన్నలూరు వరకు సోమవారం ఉదయం 8 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, కార్యక్రమంలో కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మణిదీపిక తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్సగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలని, చల్లని గాలి తగిలేలా చూసుకోవాలని అలాగే ఉప్పు కలిపిన మజ్జిగ గానీ, ఓఆర్ఎస్ వంటివి తాగించి వీలైనంత త్వరగా ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 11 గంటల లోగా ముగించుకొని ఇళ్లకి చే రుకొని ఎండతీవ్రత నుంచి తప్పించుకోవాలని చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



రాములు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో తలకు తీవ్రగాయాలై ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన దార్ల రాములు(65)ను ఈ నెల 20వ తేదీన లక్కంతోటి కోటయ్య, అతని కొడుకులు పిచ్చయ్య, కోటేశ్వరరావులు ఇంటి మధ్య ఉన్న ఖాళీ స్థలం విషయమై కర్రతో దాడి చేశారు. తలకు తీవ్రగాయం కావడంతో ఆయనను జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఉలవపాడు: వారం రోజుల పాటు స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందచేశారు. ముందుగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం వారం రోజులగా గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం, డిక్టేషన్, వ్యాసరచన, లెమన్ స్పూన్, పరుగు పందెం, చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మొత్తం 150 బహుమతులను గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అందించారు.

107 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కారుమంచి ఎంవీ కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్టు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ ప్రారంభించారు. అత్యాధునిక పరికరాలతో 107 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలపాటి రామరాజు, మన్నం వెంకయ్య, సత్యనారాయణరాజు, రామిశెట్టి దాసయ్య, జిల్లా వికలాంగుల సంఘ అధ్యక్షుడు రాజేష్, ఆనందు, మణికంఠ, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కనిగిరిలో భాగస్వాములు కండి



సబ్‌జైలు భవన బయట ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, ఎంపీపీ

కనిగిరి రూరల్: ప్రభుత్వ కార్యాలయ భవనాల సముదాయల ప్రాంతాల్లో పరిశుభ్రత వాతావరణం ఉండేందుకు అందరూ సహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక ఆర్టీఓ, రెవెన్యూ, మండల పరిషత్, సబ్ ట్రెజరీ కార్యాలయల ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల సముదాయ ప్రాంగణాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటి, పారిశుధ్య కార్యక్రమాలు నిత్యం చేపడతామన్నారు. స్వచ్ఛ కనిగిరిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ఆఫీసుల వద్ద మల, మూత్ర విసర్జనలు చేయకుండా, వ్యర్థ పదార్థాలను వేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ కార్యాలయల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు అబ్రహం లింకన్, డీఏఓ కిషోర్‌రెడ్డి, ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సయ్యద్ నాయబ్ రసూల్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న సబ్ జైలు ప్రాంగణం పరిశీలన

నిర్మాణంలో ఉన్న సబ్ జైలు ప్రాంగణాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు ఆదివారం పరిశీలించారు. సబ్ జైలుకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రత్యేక నిధుల మంజూరుకు ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సబ్ జైలు త్వరగా పూర్తయి, ప్రారంభమైతే ఈ ప్రాంత ప్రజలకు, పోలీస్ శాఖకు, సిబ్బందికి ఇబ్బందులు తొలుగుతాయన్నారు. తక్షణ చర్యగా ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు చేయించారు.

బీటెక్ విద్యార్థి మృతిపై కేసు నమోదు

పామూరు: మండలంలోని కోడిగుంపల గ్రామ సమీపంలో శనివారం ఈతకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి వేమూరి మదన్(20) మృతి చెందాడు. దీనిపై ఆదివారం మృతుడి తండ్రి అయ్యన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న చైర్మన్ కల్లూరి రామిరెడ్డి

పామూరు: పర్యావరణ పరిరక్షణ, సమాజసేవపై యువత దృష్టి సారించాలని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తాము ఆచరిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వికలాంగురాలి కుటుంబసభ్యులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. స్వచ్ఛందసంస్థ మండల అధ్యక్షుడు ఆకుల మాల్యాద్రి, కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, కోడూరి ప్రభాకర్, కోఆప్షన్ సభ్యులు నాయబ్‌రసూల్, అంబటి కొండారెడ్డి, సిద్దమూర్తి లక్ష్మిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి భారీగా విరాళాలు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి దేవాలయ పునఃనిర్మాణానికి భక్తులు పెద్ద ఎత్తున విరాళాల రూపంలో నగదు అందజేస్తున్నారు. మాటూరి శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ దంపతులు రూ 25,116లను స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. లంకెనపల్లి బ్రహ్మానందం, గౌరీ దంపతులు రూ.25,116, బెల్లంకొండ మాధవరావు, సునీత దంపతులు రూ.25,116, బెజవాడ వెంకటేశ్వర్లు, నాగేశ్వరి దంపతులు రూ.50,200 నగదును ఆయ కమిటీకి అందజేశారు. కొండూరి వసంతరావు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, సూరం వేణుగోపాల్‌రెడ్డి, తోకల కొండయ్య, మురారిశెట్టి శ్రీకాంత్, ఆచారి, ఆవుల మాధవరావు, మాదాల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడిపై ఫిర్యాదు



క్షతగాత్రుడు సురేష్

కొండపి: స్థానిక జాళ్లపాలెం రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రీకొడుకులను శనివారం రాత్రి సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి గాయపరిచారనే విషయమై కొండపి స్టేషన్‌లో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై జిలానిబాషా తెలిపిన సమాచారం మేరకు పెదకండ్లగుంట గ్రామానికి చెందిన సీహెచ్ సురేష్ కొండపి బస్టాండ్ సెంటర్‌లో జ్యూస్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో షాపు మూతవేసుకుని ద్విచక్ర వాహనం మీద తండ్రి నరసింహంతో కలిసి గ్రామానికి బయలుదేరాడు. స్థానిక చెరువుకొమ్ము వద్ద వెంకయ్యస్వామి గుడి సమీపంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వెంబడించి కర్రలతో దాడి చేయగా సురేష్ తీవ్ర, నరసింహంకు స్వల్ప గాయాలయ్యాయి. వైద్యం కోసం క్షతగాత్రులు కొండపి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై జిలానీబాషా తెలిపారు.

30 నుంచి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు గ్రామంలో ఉయ్యాల పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను ఈ నెల 30, 31, జూన్ 1వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకుడు బాచిమంచి అరుణకుమార్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం గణపతి పూజ, అఖండదీప స్థాపన, యాగశాల సంస్కార, అంకురారోపణము, జలాధివాసము, అగ్ని ప్రతిష్ఠ, దీక్ష హోమము, బుధవారం సర్వదేవతా ప్రార్థన, మండప దేవతా పూజలు, పంచగవ్య, పంచామృత, గురువారం ఉదయం 8.08 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ, విగ్రహాల బిగింపు, తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులకు మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సయ్యద్ కలాం, పక్కన చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, ఎస్‌బీసీసీసెల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండ్రు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం బాలకల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాలలో బాలికలకు ప్రత్యేక ప్యాడ్స్, పరిశుభ్రతమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌డీ అబ్దుల్ కలాం మాట్లాడుతూ రుతుస్రావం స్త్రీ శరీరంలో ఒక సహజ ప్రక్రియ అని తెలిపారు. ఇలాంటి సమయంలో మహిళలు పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రఘు, గ్రంథపాలకుడు మొహ్మద్ షరీఫ్, హెల్త్ సూపర్‌వైజర్ కొండమ్మ, కిరణ్, సీఓలు దీప్తి, సురత్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదంలో 9 మందికి గాయాలు

కొనకనమిట్ల: ముందుగా వెళ్తున్న ఆటోను వెనుక నుంచి మరో ఆటో ఢీకొట్టడంతో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ సంఘటన 565 జాతీయ రహదారిపై మండలంలోని చౌటపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఎదురాళ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు తర్లుపాడు మండలం లక్ష్మక్కపల్లిలో వివాహానికి హాజరయ్యేందుకు ఆటోలో వెళ్తున్నారు. ఆటో చౌటుపల్లి సమీపంలోకి రాగానే వెనుక నుంచి మామిడికాయల లోడుతో వస్తున్న మరో ఆటో ఢీకొట్టింది. దీంతో ఎదురాళ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన పందిటి మరియమ్మ, కమలమ్మ, మరియమ్మ, యాకోబు, యశోద, జయరావు తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా కారులో వెళ్తున్న వారు స్పందించి క్షతగాత్రులను తమ వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇద్దరు జూదరులు అరెస్ట్

సింగరాయకొండ: మండలంలోని కలికివాయి పొలాల్లో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.6 వేల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎండీ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

వరిగడ్డి వామి దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డి

లింగసముద్రం: మండలంలోని మాలకొండ్రాయునిపాలెంలో ఆదివారం మధ్యాహ్నం వరిగడ్డి వామికి నిప్పు అంటుకోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గాయం శ్రీనివాసులు గేదెలు మేపుకునేందుకు రూ.లక్ష విలువైన పశువుల మేత వరిగడ్డిని ఇతర గ్రామాల నుంచి కొనుగోలు చేసి ట్రాక్టర్లతో తన వాముల దొడ్డిలో వామిగా వేశాడు. శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వరిగడ్డి వామి వద్ద పొగలు వస్తుండడాన్ని గ్రామస్తులు కొందరు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా వామికి నిప్పంటుకుని కాలిపోయింది. గ్రామస్తులు కందుకూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చేసరికి వరిగడ్డి మొత్తం కాలిపోయింది. పశువుల కోసం కొనుగోలు చేసిన వరిగడ్డి అగ్గిపాలు కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనివాసులు అభ్యర్థించారు.